క్లుప్తంగా

శివయ్యకు నవ నీరాజన సౌభాగ్యం



నాగాయలంక: స్థానిక కృష్ణానది తీరంలోని శ్రీరామలింగేశ్వరస్వామి మండపంలో శనివారం రాత్రి నవహారతులు భక్తులను కనుల పండువగా అలరించాయి. అంబా సాయికిరణ్ శర్మ నేతృత్వంలో శివయ్య, నందీశ్వరులకు శాస్త్రోక్తంగా పూజ జరిపి మంత్రపుష్ప నీరాజనాలు సమర్పించారు. ఉభయదాతలైన రేపల్లె రామ్మోహన్‌రావు, అరుణకుమారి దంపతులు తొలుత కోటివత్తులకు దీప ప్రజ్వలన చేశారు. అర్చకులు అంబా సాయికిరణ్‌శర్మ, ముదునూరి అచ్యుత్, లక్ష్మీనరసింహశాస్త్రి నవ హారతులను నయనానందకరంగా ప్రదర్శించారు. శ్రీరామపాదక్షేత్రం కమిటీ చైర్మన్ ఆలూరి శ్రీనివాసరావు, క్షేత్రపాలకుడు తలశిల రఘుశేఖర్, ఉప్పల బుజ్జి, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు. నాగాయలంకలోని పురాతనమైన శ్రీరుక్మిణీ సమేత శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో శనివారం రాత్రి సహస్ర కార్తిక దీపాలంకరణ చేశారు. అర్చకుడు డీవీకే సత్యప్రసాద్ నేతృత్వంలో పూజా కార్యక్రమాలు జరిగాయి.

ఫార్మసీ రంగంలో అవకాశాలు పుష్కలం




కోనేరుసెంటర్: ఫార్మసీ రంగంలో ఉపాధి అవకాశాలు తక్కువగా ఉంటాయనేది అపోహ మాత్రమే అని, భవిష్యత్ ఫార్మా రంగందే అని డ్రగ్ ఇన్‌స్పెక్టర్ గోపాలకృష్ణ అన్నారు. కృష్ణా విశ్వవిద్యాలయ ఫార్మసీ కళాశాల ఆధ్వర్యంలో 63 వ జాతీయ ఫార్మా వారోత్సవ ముగింపు వేడుకలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఫార్మసిస్టులకు మించిన కౌన్సిలర్ రోగులకు మరొకరు ఉండరని అన్నారు. విశ్వవిద్యాలయ రెక్టార్ ఆచార్య ఎంవీ బసవేశ్వరరావు మాట్లాడుతూ వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు వస్తున్నాయని వాటిని విద్యార్థులు అందిపుచ్చుకోవాలన్నారు. ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాంబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డీన్ మారుతి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం పలు అంశాలపై నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.

దళారులను నమ్మి తక్కువ ధరకు అమ్ముకోవద్దు



పెడన: మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను తెరిచామని, రైతులు తప్పనిసరిగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి లబ్ధి పొందాలని పెడన ఇన్‌చార్జి ఏవో నూరుస్నీసా అన్నారు. మండలంలోని కాకర్లమూడి రైతు సేవా కేంద్రంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ధాన్యం అమ్మిన రైతులకు 48 గంటల వ్యవధిలో వారి ఖాతాలలో నగదు జమ అవుతుందన్నారు. రైతులు రైతు సేవా కేంద్రాలలో షెడ్యూలింగ్ చేయించుకుని జియో ట్యాగింగ్ ఉన్న వాహనం ద్వారా ట్రక్ షీట్‌తో ధాన్యాన్ని మిల్లుకు తరలించాలన్నారు. ఇప్పటి వరకు మండలంలో 260.12 మెట్రిక్ టన్నుల ధాన్యం రైతుల వద్ద నుంచి కొనుగోలు చేశామన్నారు. దళారులను నమ్మి మోసపోవద్దని, కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించుకోవాలని కోరారు.

శివాయ శివరూపాయ అలంకృత మహాదేవ



నాగాయలంక: స్థానిక శ్రీపార్వతీ సమేత కన్యకాపరమేశ్వరీ సమన్విత శ్రీనగరేశ్వర స్వామి ఆలయంలో అర్చకుడు కొల్లిపర సుబ్బారావు నేతృత్వంలో శివాయ శివ రూపాయ అలంకారంలో రూపొందించిన నగరేశ్వరుడు భక్తులను అలరించారు. 32వ వార్షిక కార్తిక మాసోత్సవాలలో భాగంగా శనివారం నగరేశ్వరునికి 11 రుద్రాలతో మహన్యాస పూర్వక అభిషేకాలు జరిపారు. ఆలయ కమిటీ చైర్మన్ చిట్టా సాంబశివరావు పర్యవేక్షణలో భక్తుల సమక్షంలో గంధం, పసుపు, కుంకుమ, విబూది, సుగంధ ద్రవ్యాలతో అభిషేక పూజ ఘనంగా జరిపారు. అనంతరం కుంకుమ ముద్దతో నగరేశ్వరుని శివ లింగానికి పూసి దానిపై భక్తిశ్రద్ధలతో పసుపు ముద్దతో శివ రూపాన్ని ఆవిష్కరించి చేసిన ప్రీతిపాత్రమైన అలంకరణ భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. అయ్యప్ప స్వాములు, భక్తులు శివ నామస్మరణతో అభిషేకాలను తిలకించి హారతులు స్వీకరించారు. దేసు సత్యనారాయణ, చిట్టా అన్నపూర్ణయ్య, తాడికొండ సత్యనారాయణ, చిట్టా శివనాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నగరంలో పడకేసిన పారిశుద్ధ్యం

- ఉన్నతాధికారుల గృహాల వద్ద సైతం చెత్త కుప్పల తొలగింపులో నిర్లక్ష్యం
- అంతంత మాత్రంగా డ్రెయిన్‌లలో పూడికతీత పనులు
- ఇతర విధుల్లో పారిశుద్ధ్య కార్మికులు
- పట్టించుకోని అధికారులు



పోలీస్ కల్యాణ మండపం సెంటర్‌లో పేరుకుపోయిన చెత్త కుప్ప

మచిలీపట్నంటౌన్: నగరంలో పారిశుద్ధ్యం నానాటికీ క్షీణిస్తోంది. పారిశుద్ధ్య విభాగంలో పని చేస్తున్న అధికారుల నుంచి కార్మికుల వరకూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారింది. రోడ్ల వెంబడి ఉన్న చెత్తను ఊడ్చటంలో నిర్లక్ష్యం వహించడంతో పాటు చెత్త కుప్పలను రోజుల తరబడి తొలగించటం లేదు. దీంతో ఏ డివిజన్‌లో చూసినా చెత్త కుప్పలే దర్శనమిస్తున్నాయి. ఇక డ్రైన్‌లలో పూడికతీత పనులు సక్రమంగా చేయకపోవటంతో పలు ప్రాంతాల్లో మురుగునీరు రోడ్ల పైకి చేరి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. డ్రైన్లలో మురుగు పారకపోవటంతో దోమలు వృద్ధి చెంది ఇబ్బందులకు గురవుతున్నారు.

ఉన్నతాధికారుల గృహాల వద్ద సైతం...

నగరంలో నివాసముంటున్న ఉన్నతాధికారుల గృహాల వద్దే పారిశుద్ధ్య పరిస్థితి అధ్వానంగా ఉంటోందంటే నగరంలో పారిశుద్ధ్య నిర్వహణ ఎంత ఘోరంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. నగరంలోని 10వ డివిజన్‌లో నివాసముంటున్న జిల్లా జాయింట్ కలెక్టర్ గీతాంజలిశర్మ, డీఆర్వో కె.చంద్రశేఖరరావు, ఎస్పీ ఆర్.గంగాధరరావు, డీఎస్పీ అబ్దుల్ సుభానీ వంటి అధికారుల నివాసాల సమీప ప్రాంతంలోనే పారిశుద్ధ్యం అధ్వానంగా ఉంది. ఇక మున్సిపల్ కమిషనర్ సీహెచ్‌వీవీఎస్ బాపిరాజు నివాసం ఉండే గాంధీనగర్ ప్రాంతంలోని ప్రధాన రహదారి డివైడర్ వెంబడి రోజుల తరబడి ఇసుక మేట వేసి ఉన్నా తొలగించటం లేదు. పాండురంగస్వామి ఉత్సవాల సందర్భంగా చిలకలపూడి ప్రాంతంలో ప్రత్యేక పారిశుద్ధ్య పనులకు 80 మంది కార్మికులతో పని చేయించారు. కానీ జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ నివాస గృహం నుంచి పాండురంగ స్వామి గుడి రోడ్‌లో ఏమాత్రం పారిశుద్ధ్య పనులు చేయకపోవటం విమర్శలకు తావిస్తోంది.

రోడ్లపై పారుతున్న మురుగు

నగరంలోని పలు డివిజన్‌లలో కచ్చా డ్రైన్‌లలో పూడికతీత పనులు సక్రమంగా జరగటం లేదు. దీంతో డ్రైన్‌లలో మురుగునీరు పూర్తి స్థాయిలో పారుదల కాక నిల్వ ఉండి రోడ్లపైకి పారుతున్నాయి. దీంతో దోమలు వృద్ధి చెంది ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారు.

అధికారుల ఇళ్ల వద్ద విధుల్లో...

నగర పాలకసంస్థలో 91 మంది శాశ్వత, 511 మంది కాంట్రాక్టు కార్మికులు పారిశుద్ధ్య విభాగంలో పని చేస్తున్నారు. వీరిలో దాదాపు 25 మంది కార్మికులకు పైగా అధికారుల గృహాల వద్ద, క్యాటిల్ డిపో, వాటర్ వర్క్స్‌లో పని చేస్తున్నారు. ప్రతి డివిజన్‌లోనూ 12 మంది కార్మికులు పని చేయాల్సి ఉండగా సరాసరి 9 మందే పని చేస్తున్నారు. దీంతో ఆయా డివిజన్‌లలో పారిశుద్ధ్య పని పడకేస్తోంది. ఇంత జరుగుతున్నా నగర కమిషనర్‌తో పాటు సంబంధిత అధికారులు పట్టీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారనే వాదనలు వినవస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి నగరంలో పారిశుద్ధ్యాన్ని గాడిలో పెట్టాలని నగర వాసులు కోరుతున్నారు.



జిల్లా ఎస్పీ నివాసం సమీపంలో పేరుకుపోయిన చెత్త కుప్ప

పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన జేసీ



లంకపల్లిలో పోలింగ్ కేంద్రంలో బీఎల్వోలతో మాట్లాడుతున్న జేసీ గీతాంజలి శర్మ

లంకపల్లి(ఘంటసాల): నూతన ఓటు నమోదు కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని కృష్ణాజిల్లా జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ అన్నారు. ఘంటసాల మండలం లంకపల్లి గ్రామంలోని జెడ్పీ హైస్కూల్‌లోని 43, 44 పోలింగ్ కేంద్రాలను జేసీ గీతాంజలి శర్మ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఓటరు శిబిరాన్ని సందర్శించి బీఎల్వోలను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఓటరు జాబితాను పరిశీలించారు. అనంతరం ఘంటసాల మండలంలో ధాన్యం సేకరణ గురించి తహసీల్దార్ బి.విజయ ప్రసాద్‌ను అడిగి తెలుసుకున్నారు. మండలంలో ఐదు మిల్లుల ద్వారా ధాన్యం సేకరణ జరుగుతున్నట్లు తహసీల్దార్ జేసీకి తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా ధాన్యం సేకరణ చేయాలని సూచించారు. కార్యక్రమంలో వీఆర్వో డి.శివకుమార్ రాజు, బీఎల్వో అశ్విన్, సిబ్బంది పాల్గొన్నారు.

ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులకు శిబిరం

పెడన: పెడన అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఓటరుగా నమోదు చేసుకోవడానికి, చిరునామాలు మార్చుకోవడానికి ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేసినట్టు పెడన ఇన్‌చార్జి తహసీల్దారు కె.అనిల్ కుమార్ తెలిపారు. మండలంలోని నడుపూరు, కొంగంచర్ల, చెన్నూరు తదితర గ్రామాల్లోని పోలింగ్‌బూత్‌లలో ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరాలను శనివారం ఆయన పరిశీలించి బూత్ స్థాయి అధికారులకు పలు సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా అనిల్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి పోలింగ్ బూత్‌లో ఓటరు నమోదు శిబిరాలను ఏర్పాటు చేశామన్నారు. ఓటరు జాబితా నుంచి చనిపోయిన వారి పేర్లు తొలగింపు, చిరునామాల మార్పు, కొత్తగా ఓటర్ల చేర్పులకు సంబంధించి దరఖాస్తులను స్వీకరిస్తున్నారని తెలిపారు. ఆయా బూత్‌లలో వాటికి సంబంధించి దరఖాస్తులను బీఎల్వోలు ఇస్తారని, వాటిని పూర్తి చేసి అక్కడే ఇవ్వాలన్నారు. ఆన్‌లైన్‌లో కూడా దరఖాస్తు చేసుకోవచ్చునని ఆయన స్పష్టం చేశారు.

ఓటరు నమోదుకు ప్రత్యేక శిబిరం

పెదకళ్లేపల్లి(మోపిదేవి): ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటర్ల నమోదుకు ప్రత్యేక శిబిరాన్ని రెండు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ శ్రీవిద్య తెలిపారు. మండలంలోని పెదకళ్లేపల్లి పోలింగ్ కేంద్రాన్ని శనివారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శని, ఆదివారాల్లో స్పెషల్‌డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఓటర్లు సదరు లిస్టులో వారి పేరు సరిగ్గా ఉన్నదో లేదో, ఓటు ఉన్నదో లేదో పరిశీలించుకోవచ్చునని సూచించారు. జనవరి 1, 2025 నాటికి 18 సంవత్సరాలు నిండిన యువకులు ఓటు హక్కుకు నమోదు చేయించుకోవల్సిందిగా కోరారు. ఇన్‌చార్జి ఆర్‌ఐ మోపిదేవి శ్రీనివాసరావు, బీఎల్‌ఓ రమణ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఆక్విడెక్టు నూతన గేట్లు పరిశీలించిన ఎమ్మెల్యే మండలి



మోపిదేవివార్పు వద్ద ఆక్విడెక్టు గేట్లు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

మోపిదేవివార్పు(మోపిదేవి): మోపిదేవి వార్పు వద్ద పులిగడ్డ ఆక్విడెక్టు ఎల్‌ఎఫ్‌ఆర్‌కు నూతనంగా ఏర్పాటు చేసిన ఏడు గేట్లను అవనిగడ్డ శాసన సభ్యుడు మండలి బుద్ధప్రసాద్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దివిసీమ కల్పతరువు పులిగడ్డ ఆక్విడెక్టును పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. రాష్ట్ర విపత్తు ఉపశమన నిధి నుంచి రూ.2.83 కోట్లతో తొమ్మిది అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. ఈ నిధుల్లో పులిగడ్డ ఆక్విడెక్టు సమగ్ర అభివృద్ధికి రూ.1.20 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. మోపిదేవివార్పు నుంచి విజయవాడ కరకట్టపై రోడ్డు విస్తరణకు నిపుణుల కమిటీ పరిశీలించిందని తెలిపారు. నియోజకవర్గంలో కీలకమైన ఔట్‌ఫాల్ స్లూయిజ్‌ల సమస్యను తాను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. సముద్ర మట్టం పెరుగుతున్న నేపథ్యంలో దిగువ మండలాలు కోడూరు, నాగాయలంక పరిధిలో 4 వేల ఎకరాలు సాగుకు నోచుకోని పరిస్థితి ఏర్పడిందన్నారు. నియోజకవర్గంలో 32 ఔట్‌ఫాల్ స్లూయిజ్‌లను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు నిపుణుల బృందాలు వీటిని పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక ఇచ్చాయని, సాధ్యమైనంతమేరకు వేసవిలో వాటిని పునఃనిర్మించేందుకు కృషిచేస్తున్నట్లు వివరించారు. ఇరిగేషన్‌శాఖ ఇన్‌చార్జి డీఈఈ పులిగడ్డ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ నియోజకవర్గంలో తూటికాడ తొలగింపు పనులకు రూ.2.30 కోట్లతో 11 పనులు, వరద నివారణకు రూ.1.28 కోట్లతో 17 పనులు చేపట్టినట్లు తెలిపారు. 43 పంట కాలువల అభివృద్ధి పనులకు ఏపీఎస్‌డీఎంఏ నిధులు రూ.38.20 కోట్లు, ఐదు చోట్ల కరకట్ట అభివృద్ధికి రూ.3.98 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు.

గుడివాడకు రాత్రి వేళల్లో ఆర్టీసీ బస్ సర్వీస్ నడపాలి

- రాత్రి 7.30 తర్వాత బస్సు లేక ప్రయాణికుల ఇబ్బందులు
- ఆర్టీసీ చైర్మన్ కొనకళ్లకు బీసీ నేతల వినతి



ఆర్టీసీ చైర్మన్ కొనకళ్లకు వినతిపత్రం అందజేస్తున్న బీసీ సంఘ నాయకులు

మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం నుంచి గుడివాడకు రాత్రి వేళలో ఆర్టీసీ బస్సు సౌకర్యం లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని రాత్రి వేళల్లో బస్సు సర్వీస్‌లను ఏర్పాటు చేయాలని ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావుకు బీసీ సంక్షేమ సంఘం నాయకులు శనివారం వినతి పత్రం అందజేశారు. సంఘ జిల్లా అధ్యక్షుడు శేకుబోయిన సుబ్రమణ్యం మాట్లాడుతూ మచిలీపట్నం నుంచి గుడివాడకు రాత్రి 7:30 గంటల తర్వాత బస్ సర్వీస్ లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారన్నారు. రాత్రి 9 గంటల వరకు గుడివాడ డిపో నుంచి మచిలీపట్నంకు, మచిలీపట్నం డిపో నుంచి గుడివాడకు బస్సులను ఏర్పాటు చేయాలని ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణకు వినతిపత్రం అందజేశారు. ఈ సమస్యను సత్వరమే పరిష్కరిస్తానని కొనకళ్ల తమకు హామీ ఇచ్చారని చెప్పారు. వినతిపత్రాన్ని అందజేసిన వారిలో బీసీ నాయకులు జన్ను గోవిందు, బెల్లంకొండ రవి, నిక్కు రాధాకృష్ణ, భోగిరెడ్డి సుభాని, నీలపాల దుర్గ,గోపి,నారేపాలెం నాని, చోడవరపు సుబ్రహ్మణ్యం, అమీన్, పడమట కోటేశ్వరరావు ఉన్నారు.

సీపీఆర్‌పై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ శేషగిరిరావు

కోడూరు: గుండె పోటు వచ్చిన వ్యక్తికి సీపీఆర్ చేసే విధానంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ధన్వంతరి జయంతిని పురస్కరించుకొని స్థానిక రవితేజ పబ్లిక్ స్కూల్‌లో శనివారం ఆరోగ్య భారతి- అవనిగడ్డ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వంగర శేషగిరిరావు మాట్లాడుతూ గుండెపోటు వచ్చిన వ్యక్తికి ఎనిమిది నిమిషాల వ్యవధిలో సీపీఆర్ చేస్తే బతికే అవకాశం ఉందన్నారు. విద్యార్థులు తప్పనిసరిగా సీపీఆర్ చేసే విధానాన్ని నేర్చుకుని, వారి తల్లిదండ్రులకు కూడా అవగాహన కల్పించాలన్నారు. అనంతరం విద్యార్థులకు ప్రయోగాత్మకంగా సీపీఆర్ చేసి చూపించారు. కార్యక్రమంలో గుడిసేవ విష్ణుప్రసాద్, ఎస్‌కేఆర్ విద్యాసంస్థల కరస్పాండెంట్ కోట వెంకటేశ్వరరావు, పాఠశాల డైరెక్టర్ వల్లభనేని వరప్రసాద్, ప్రిన్సిపాల్స్ బడే కరుణ, కొరివి అనిల్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

నాగాయలంకలో నేడు ఉచిత కంటి వైద్యశిబిరం

నాగాయలంక: జిల్లా అంధత్వ నివారణ సంస్థ, పెదకాకాని శంకర కంటి ఆసుపత్రి సహకారంతో స్థానిక సుదర్శి మానవతా సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్షుడు తలశిల రఘుశేఖర్ శనివారం తెలిపారు. తలశిల శ్రీరాములు, ఉప్పల వెంకయ్య, కనిగంటి అంకినీడు /జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యుల ఆర్థిక సౌజన్యంతో నాగాయలంకలోని మారుతీ విద్యానికేతన్ డిజిటల్ స్కూలు ఆవరణలో ఉదయం 9 నుంచి ఒంటి గంట వరకు ఈ శిబిరం ఉంటుందన్నారు. శుక్లాలు ఉన్న వారికి కంటిలోపల అద్దాలు అమర్చే ఆపరేషన్‌లు (ఐఎల్) శంకర కంటి ఆసుపత్రిలో ఉచితంగా చేయిస్తామని తెలిపారు.

డీఎస్సీ రిక్రూట్‌మెంట్ పరీక్షలకు ఉచిత శిక్షణ

చిలకలపూడి(మచిలీపట్నం): మెగా డీఎస్సీ-2024 రిక్రూట్‌మెంట్ పరీక్షలకు బీసీ, ఎస్సీ, ఎస్టీ కులాలకు చెందిన వారికి వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ నిమిత్తం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖాధికారి జి.రమేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉచిత శిక్షణ 100 మంది అభ్యర్థులకు రెండు నెలల పాటు ఇస్తామన్నారు. శిక్షణతో పాటు స్టైఫండ్, స్టడీ మెటీరియల్ ఏర్పాటు చేస్తామన్నారు. ఉచిత శిక్షణ కోసం దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు టెట్ పరీక్ష క్వాలిఫై అయి ఉండాలన్నారు. డీఈడీ, టీటీసీ మార్కుల ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తామన్నారు. వివరాలకు 98494 20123, 94413 09317 నంబర్లను సంప్రదించాలన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం



గూడూరు: సత్యసాయి బాబా 99వ జన్మదినాన్ని పురస్కరించుకుని శ్రీ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన డివిజన్ స్థాయి వ్యాస రచన పోటీలలో గూడూరు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు.ఆంగ్ల, తెలుగు భాషలలో వేర్వేరుగా నిర్వహించిన పోటీలలో పాఠశాల విద్యార్థులు జంగం భాను, గౌరిపర్తి జాహ్నవి ప్రథమ బహుమతి సాధించగా, ఉలవలపూడి లక్ష్మి, యార్లగడ్డ వెంకటేశ్వరమ్మ ద్వితీయ బహుమతి సాధించారు. ఇంటర్మీడియెట్ విభాగంలో బెవర హరిత, ఊసా కీర్తి, ఆబెదున్నిసా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించినట్లు ఇన్‌చార్జి హెచ్‌ఎం ఎస్.పద్మజాదేవి తెలిపారు. విజేతలకు శనివారం పాఠశాల ఆవరణలో బహుమతి ప్రదానం చేశారు.

మున్సిపాలిటీ ఆదాయం పెరిగేలా కృషి చేయాలి

పెడన: పట్టణాల్లో ప్లానింగ్ కార్యదర్శులు మున్సిపాలిటీ ఆదాయం పెరిగేలా కృషి చేయాలని పురపాలక శాఖ రాజమహేంద్రవరం రీజనల్ డెప్యూటీ డైరెక్టర్ ఆఫ్ టౌన్ ప్లానింగ్ అధికారి ఎన్.శ్రీనివాసమూర్తి అన్నారు. ఆయన శనివారం రాజమహేంద్రవరం నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పెడన నుంచి టీపీవో సుగుణకుమారితో పాటు బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు పామర్తి జితేంద్ర, బండి కిరణ్, ప్లానింగ్ కార్యదర్శులు హాజరయ్యారు. శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ పట్టణంలో ప్రధాన రహదారులు, అంతర్గత రహదారుల్లో ఉన్న ఆక్రమణలను తక్షణం తొలగించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రోడ్డు విస్తరణకు సంబంధించి ఏమైనా సర్క్యులర్ జారీ అవగానే తక్షణం స్పందించి ఆయా పనులను వేగవంతం చేయాలని సూచించారు. ప్రధానంగా మున్సిపల్ ఆదాయం పెంచేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

వ్యాసరచన పోటీ విజేతకు అభినందన

అవనిగడ్డ: సత్యసాయి సేవాసంస్థ నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిని బండి నాగసౌమ్య ప్రథమస్థానం సాధించినట్లు ప్రిన్సిపాల్ పి.రేఖారాణి తెలిపారు. స్థానిక త్యాగరాజ కళామందిరంలో జరిగిన పోటీల్లో నాగసౌమ్య ప్రథమస్థానంలో నిలవగా శనివారం ప్రిన్సిపాల్‌తో పాటు పలువురు అధ్యాపకులు ఆమెను అభినందించారు.

అగ్ని ప్రమాద బాధితునికి సాయం

కోసూరువారిపాలెం(మోపిదేవి): కోసూరువారిపాలెం శివారు గొల్లపాలెంలో ఇటీవల అగ్నిప్రమాదంలో దేవనబోయిన వీరరాఘవులు ఇల్లు పూర్తిగా దగ్ధమైన విషయం తెలిసిందే. బాధిత కుటుంబానికి శనివారం జనసేన యువనాయకుడు మండలి వెంకట్రామ్ నూతన వస్త్రాలు, దుప్పట్లతో పాటు జనసేన పార్టీ ఆధ్వర్యంలో సమకూర్చిన రూ.13,200 నగదు, బియ్యం, కూరగాయలు అందజేశారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మోపిదేవి శాఖ తరఫున వంటపాత్రలు, హైజెనిక్ కిట్ అందించారు.

నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి

పెడన: వేలిముద్ర వేసే వారు ఇక నుంచి సంతకాలు చేసేలా చూడాలని, నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దే బాధ్యత బుక్ కీపర్లు తీసుకోవాలని పెడన ఎంపీపీ రాజులపాటి వాణి అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశ హాలులో శనివారం వయోజన విద్యా శాఖ ఆధ్వర్యంలో వెలుగు బుక్‌కీపర్లకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం జరిగింది. సమావేశానికి ఎంపీపీ వాణి ముఖ్యఅతిథిగా విచ్చేసి బుక్ కీపర్లకు పలు సూచనలు ఇచ్చారు. తొలుత మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ గ్రామస్థాయిలో డ్వాక్రా గ్రూపులలో చదువు రాని వారిని గుర్తించి వారిని అక్షరాస్యులుగా తీర్చిదిద్ది, సంతకాలు చేసేలా చూడాలని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాజులపాటి అచ్యుతరావు, ఎంఈవో-2 హరనాథ్, ఇన్‌చార్జి ఎంపీడీవో జయరాం, రిసోర్స్ పర్సన్ అప్పినీడు పోతురాజు, వెలుగు ఏపీఎం శ్రీదేవి, సీసీలు, బుక్ కీపర్లు పాల్గొన్నారు.

కృష్ణా వర్సిటీలో ఎన్‌సీసీ డే వేడుకలు

కోనేరుసెంటర్: కృష్ణా విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాలలోని నేషనల్ క్యాడెట్స్ కార్ప్స్ (ఎన్‌సీసీ) ఆధ్వర్యంలో శనివారం ఎన్‌సీసీ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.విజయ కుమారి హాజరయ్యారు. అసోసియేట్ ఎన్‌సీసీ అధికారి డాక్టర్ డి.రామశేఖరరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం క్యాడెట్లకు వివిధ శిక్షణ శిబిరాలకు సంబంధించిన సర్టిఫికెట్లను అందజేశారు.

కుల గణన నిర్వహించాలి

మచిలీపట్నంటౌన్: జన గణనతో పాటే పదేళ్లకోమారు కుల గణన చేపట్టాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కుక్కల వీర వెంకట సత్యనారాయణ డిమాండ్ చేశారు. స్థానిక బస్టాండ్ సెంటర్‌లోని జిల్లా బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో ఆ సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ బ్రిటీష్ కాలం నుంచి ఏర్పడిన కులగణన, జనగణన లెక్కల సేకరణను ప్రతి పది సంవత్సరాలకు ఒకసారి చేయాల్సి ఉండగా జనగణన మాత్రమే నిర్వహిస్తూ, కుల గణన చేయకుండా ప్రభుత్వాలు వెనుకబడిన వర్గాల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కుల గణన నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ ఈ నెల 25వ తేదీ సోమవారం జిల్లా కలెక్టర్ డీకే బాలాజీకి వినతిపత్రం అందజేయాలని సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. సమావేశంలో సంఘ నాయకులు వెంకటేశ్వరరావు, టి.రాజ్యలక్ష్మి, కె.ఆదిలక్ష్మి, ఎం.దేవిక, ఎం.భాస్కర్, ఆంజనేయులు, కె.కిషోర్, ఎన్.వెంకట సూర్య బాబు తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీవో కార్యాలయాన్ని సందర్శించిన డీటీఏవో



బంటుమిల్లి: జిల్లా ట్రెజరీ(డీటీఏవో) అకౌంట్స్ అధికారి వి.రవికుమార్ శనివారం బంటుమిల్లి సబ్ ట్రెజరీ(ఎస్టీవో)కార్యాలయాన్ని సందర్శించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా రికార్డులు పరిశీలించిన ఆయన ఎస్టీవో కె.గోపీకృష్ణ, సిబ్బందితో సమీక్షించారు. వివిధ ప్రభుత్వ శాఖల బిల్లులు ఆడిటింగ్, పెన్షన్ల చెల్లింపులు తదితర శాఖాపరమైన రికార్డులు పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. కార్యాలయానికి వచ్చిన విశ్రాంత ఉద్యోగులు, పలు ప్రభుత్వ శాఖల సిబ్బందితో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బిల్లుల చెల్లింపులో సమయపాలన పాటించాలని సిబ్బందిని హెచ్చరించారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ చక్రధర్, సత్యనారాయణ, వెంకటేశ్వరరావు, విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు గంగాజలం పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రానికి సామగ్రి వితరణ

కోనేరుసెంటర్: మండల పరిధిలోని తాళ్లపాలెం పంచాయతీ శివారు జొన్నలవారి మోడి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రానికి గ్రామానికి చెందిన పోకల రామారావు పలు పనిముట్లను వితరణగా అందజేశారు. కేంద్రానికి అవసరమైన చాపలు, దుప్పట్లు, ఫ్యాను, రైస్‌కుక్కర్‌లను బందరు రూరల్ సీడీపీవో గ్లోరీకి అందజేశారు.

భక్తి శ్రద్ధలతో సత్యసాయిబాబా జయంతి

మచిలీపట్నంటౌన్: భగవాన్ శ్రీ సత్యసాయి బాబా 99 వ జయంతి వేడుకలను శనివారం స్థానిక ఈడేపల్లి లోని బాబా సేవా సమితి వద్ద భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సర్వజన ఆస్పత్రిలోని రోగులకు పండ్లు, సమితి వద్ద పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. రేవతి టాకీస్ సెంటర్‌లోని గంగానమ్మ గుడి వద్ద, రైలుపేట యానాదుల కాలనీ, శ్రీనివాస్ నగర్ భజన సెంటర్‌లలో అన్నదానం చేశారు. సాయంత్రం స్వామివారి ఊంజల సేవ నిర్వహించారు.

పెడనలో..

పెడన: శ్రీసత్యసాయిబాబా 99వ జయంతి వేడుకలను పట్టణంలోని శ్రీసత్యసాయిమందిరంలో శనివారం ఘనంగా నిర్వహించారు. తొలుత సత్యసాయిబాబా చిత్రపటంతో పురవీధులలో పల్లకీ సేవ నిర్వహించారు. చిన్నారుల కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది. అనంతరం మందిరంలో అభిషేకాలు, ప్రత్యేక పూజాది కార్యక్రమాలు చేశారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధనలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. సమయమంతుల ముత్యాలరావు, కొమరగిరి చంద్రశేఖరరావు, మట్టా రాధాకృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ధ్యాన మందిరం ప్రారంభం

లంకపల్లి(ఘంటసాల): ఘంటసాల మండలం లంకపల్లి గ్రామంలో పుట్టపర్తి సత్య సాయిబాబా జయంతి సందర్భంగా నూతనంగా ఏర్పాటు చేసిన సత్య సాయి బాబా ధ్యాన మందిరాన్ని ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్, యువనేత వెంకట్రామ్ శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, భక్తులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

ఘంటసాలలో శ్రీసత్యసాయిబాబా జయంతి వేడుకలు

ఘంటసాల: భగవాన్ శ్రీ సత్యసాయిబాబా 99వ జయంతి వేడుకలు ఘంటసాల గ్రామంలోని శ్రీసత్యసాయి సేవాసమితి ప్రాంగణంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 8,9,10 తరగతుల విద్యార్థులకు నిర్వహించిన వ్యాస రచన పోటీల్లో విజేతలకు ప్రశంసా పత్రాలను అందజేశారు. అనంతరం 200 మందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా సమితి కన్వీనర్ పోలన జయ ప్రసాద్, దోనేపూడి సాయి జ్యోతి, సమితి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



మచిలీపట్నంలో రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న సత్యసాయిబాబా సేవా సమితి సభ్యులు



పెడనలో పల్లకీ సేవలో భక్తులు